క్లుప్తంగా...

ప్రారంభమైన ఏరోబిక్స్ ఛాంపియన్‌షిప్



ఏరోబిక్స్ పోటీలకు హాజరైన విద్యార్థులు

మల్లాపూర్: నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో సీబీఎస్సీ నేషనల్ ఏరోబిక్స్ ఛాంపియన్‌షిప్-2023 వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. వేడుకలను డీపీఎస్ విద్యాసంస్థల చైర్మన్ మల్కా కొమరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏరోబిక్స్ వంటి గ్రేమ్స్‌తో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. కార్యక్రమంలో దేశంలోని దాదాపు 100 పాఠశాలలకు చెందిన వెయ్యి మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో డీపీఎస్ ప్రిన్సిపాల్ సునీతారావు, ప్రధానోపాధ్యాయురాలు రుబెక్కా సిన్హా తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్రనగర్‌లో డ్రైనేజీ పనులు ప్రారంభించాలి



కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రాఘవేంద్రనగర్ కాలనీవాసులు

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్ ఫేజ్-3లో డ్రైనేజీ పనుల కోసం రూ.33 లక్షలు మంజూరైనా పనులు ప్రారంభం కావడం లేదని, త్వరగా పనులను ప్రారంభించాలని 25 కుటుంబాలు సంతకాలు చేసి జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌కు కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో రాజకీయాలు ముఖ్యం కాదన్నారు. కార్యక్రమంలో నరసింహారావు, కృష్ణరాజు, హైదర్, రాములు, శ్రీనివాస్, బాలకృష్ణ, లక్ష్మణ్, ఆనంద్, పరమేస్, విఠల్ యాదవ్, రాజబాబు, అంజి, సంతోష్, యాదగిరి, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ముగిసిన ఇంటర్ స్కూల్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్



విజేత టీమ్‌తో డీపీఎస్ చైర్మన్ తదితరులు

మల్లాపూర్: నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో మూడు రోజులుగా జరిగిన డీపీఎస్ స్కూల్ సొసైటీ- ఇంటర్ స్కూల్ బాస్కెట్ బాల్(బాలురు) ఓపెన్-23 టోర్నమెంట్ ముగిసింది. బాస్కెట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మ్యాచ్ నిబంధనల ప్రకారం జరిగాయి. డీపీఎస్ బెంగళూరు సౌత్ డీపీఎస్ సొసైటీ ఇంటర్ డీపీఎస్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచింది. గెలుపొందిన టీమ్‌కి అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు విశాల్, జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు శ్రీనాథ్, డీపీఎస్ చైర్మన్ మల్కా కొమరయ్య ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మల్కా యశస్వి, ప్రిన్సిపాల్ సునీతారావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో రౌడీ షీటర్ల బైండోవర్

ఉప్పల్: అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లను బైండోవర్ చేసినట్లు ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రవణ్ కుమార్ తెలిపారు. ముందస్తు చర్యలో భాగంగా స్టేషన్ పరిధిలో ఉన్న ఐదుగురు రౌడీ షీటర్లతో పాటు, ఇతర నేరాల్లో పాల్గొన్న, నేర చరిత్ర ఉన్న మరో 90 మందిని కూడా బైండోవర్ చేసినట్లు తెలిపారు. లైసెన్స్ కలిగి ఉన్న 40 వరకు వెపన్స్ కూడా సంబంధిత విభాగాల్లో సరెండర్ చేయించినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా వెపన్స్ కలిగి ఉన్నవారు వెంటనే సంబంధిత విభాగాల్లో సరెండర్ చేయాల్సిందిగా కోరారు.

అమ్మవారి పూజల్లో కార్పొరేటర్ శ్రీదేవి



కుషాయిగూడ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుషాయిగూడ అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ నేత పాండాల శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, నారెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, బొడిగె ప్రభుగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో ప్రతిసారీ కొత్తవారే..

జంగ్ తెలంగాణ 2023

ఉప్పల్: పునర్విభజనలో భాగంగా కొత్తగా ఏర్పడిన నాటి నుంచి.. నేటి వరకు ఉప్పల్ నియోజకవర్గంలో కొత్త వ్యక్తికే ఎమ్మెల్యేగా అవకాశం వచ్చింది. ఇప్పటి వరకు ఎప్పుడు ఒక్కొక్కరికి ఒక్కసారే ఎమ్మెల్యేగా అవకాశం లభించింది. పునర్విభజనలో భాగంగా అప్పటి మేడ్చల్ నియోజకవర్గం నుంచి ఉప్పల్ 2009లో ఉప్పల్ నియోజకవర్గంగా అవతరించింది. నియోజకవర్గంలో 3,62,356 మంది ఓటర్లు ఉన్నారు. ఆ సమయంలో 1,53,375 మంది ఓట్లు మాత్రమే పోలయ్యాయి.

- 2009లో కాంగ్రెస్ పార్టీ(ఐఎన్‌సీ) అభ్యర్థిగా బండారి రాజిరెడ్డి, టీఆర్ఎస్(కూటమి) అభ్యర్థిగా ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, పీఆర్‌పీ(ప్రజారాజ్యం పార్టీ) నుంచి అమిరిశెట్టి నరేందర్ పోటీలో ఉన్నారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బండారి రాజిరెడ్డి 28,183 మంది ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు.



- 2014 ఎన్నికల సమయంలో 4,21,702 మంది ఓటర్లు ఉండగా 2,31,892 మంది ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీఆర్ఎస్ నుంచి బేతి సుభాష్‌రెడ్డి, బీజేపీ నుంచి ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ(ఐఎన్‌సి) నుంచి బండారి లక్ష్మారెడ్డి బరిలో ఉండగా చివరకు బీజేపీ అభ్యర్థి ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ 14 వేలపై చిలుకు ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు.
- 2018 ఎన్నికల్లో 4,54,690 మంది ఓటర్లు ఉండగా 2,27,899 మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీఆర్ఎస్ అభ్యర్థి బేతి సుభాష్‌రెడ్డి, టీడీపీ(కూటమి) అభ్యర్థి టి.వీరేందర్‌గౌడ్, బీజేపీ నుంచి ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ బరిలో ఉండగా టీఆర్ఎస్ అభ్యర్థి బేతి సుభాష్‌రెడ్డి 48 వేల ఓట్లపై చిలుకుతో విజయం సాధించారు. ఈసారి కూడా నియోజకవర్గంలో కొత్తవారికే ప్రజలు అవకాశం కల్పిస్తారని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజల తీర్పు కోసం వేచి చూడాల్సిందే..

పేదల సంక్షేమం కోసమే బీఆర్ఎస్ మేనిఫెస్టో

ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బీఎల్ఆర్



ప్రచార యాత్రలో బీఎల్ఆర్ తదితరులు

రామంతాపూర్: పేదల సంక్షేమం, అభివృద్ధి కోసమే బీఆర్ఎస్ రూపొందించిన మేనిఫెస్టో ధ్యేయమని ఉప్పల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం హబ్సిగూడ డివిజన్ పరిధిలోని గణేష్‌నగర్, శ్రీనివాసపురం, గోకుల్‌నగర్, వివేక్‌నగర్, యాదయ్య హోటల్, వెంకట్‌రెడ్డినగర్‌లలో కార్యకర్తలు, నేతలతో కలిసి ఆయన పాదయాత్ర చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, వృద్ధులకు, దివ్యాంగులకు, మహిళలకు యువతకు పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని అదేవిధంగా ఇల్లు లేని నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూమ్‌లు కేటాయించడానికి చర్యలు తీసుకుంటుందని ఉప్పల్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 2007 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించామన్నారు. నియోజకవర్గంలో తాను చేస్తున్న ఎన్నికల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటచారి, ప్రధాన కార్యదర్శి కంచర్ల సోమిరెడ్డితో పాటు బీఆర్ఎస్ నేతలు బుచ్చిరెడ్డి, ఏకాంతరావు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి బయోడేటా



పేరు: మర్రి రాజశేఖర్‌రెడ్డి.
తల్లి దండ్రులు: లక్ష్మణ్‌రెడ్డి, అరుంధతిరెడ్డి
వయస్సు: 53
భార్య: మమతరెడ్డి
కుమారుడు: ధీరెన్‌రెడ్డి.
కుమార్తె: అను శ్రేయారెడ్డి
నివాసం: బోయిన్‌పల్లి
జననం: 17-06-1970 హైదరాబాద్
చదువు: డిగ్రీ (బీకాం)

- 2019లో అప్పటి టీఆర్ఎస్ (బీఆర్ఎస్) పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డిపై స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. అప్పటి నుంచి బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం మల్కాజిగిరి అసెంబ్లీ అభ్యర్థిగా బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

ముగిసిన ఇంటర్నేషనల్ ఫ్యాకల్టీ సదస్సు



సదస్సులో ప్రొఫెసర్లు

అల్వాల్: అల్వాల్‌లోని లయోలా అకాడమీ, ఐక్యుసి, ఆల్ ఇండియా అసోసియేషన్ ఫర్ క్రిస్టియన్ హయ్యర్ ఎడ్యుకేషన్, ఆసియా నెట్‌వర్క్ ఆఫ్ ది యునైటెడ్ స్టేట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ బుధవారం హైబ్రిడ్ మోడ్(ఆన్‌లైన్ అండ్ ఆఫ్‌లైన్)లో నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో 21వ శతాబ్దపు విద్యలో క్లిష్టమైన అంశాల గురించి, ఫ్యాకల్టీ ఎక్సలెన్స్ ఇన్ టీచింగ్ అండ్ స్కాలర్‌షిప్, పరిశోధించడానికి ప్రపంచ నిపుణులు, విద్యావేత్తలతో వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్యంగా డాక్టర్ గ్లెన్‌శివ్ నేతృత్వంలో, గ్లోబల్ కేఫ్ 21వ శతాబ్దంలో ఇష్యూస్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ టీచింగ్ అండ్ లెర్నింగ్ ప్రొఫెసర్ స్పెన్సర్ టిన్సన్ నేతృత్వంలో అవుట్‌కమ్ బేస్ట్ ఎడ్యుకేషన్(ఓబీఈ), కృత్రిమ మేధ అనుసంధానం(ఏఐ), ఇన్నోవేటివ్ అసెస్‌మెంట్ టెక్నిక్ వంటి కీలకమైన అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సుచరిత, కింగ్‌షుక్ ముఖర్జీ, లయోలా అకాడమీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.జోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో బుధవారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బతుకమ్మ, దసరా ఉత్సవాల్లో భాగంగా వినయ్ కుమార్ శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. పుష్పాంజలి, శ్లోకాంజలి, జయ జయ దుర్గే, శ్రీలలిత హారతి, అన్నమాచార్య కీర్తనలను మంగిని, హాసిని, శ్రీనిధి, శ్రవ్య, ఆద్య, అంవక, ప్రియాంక, దాక్షిణ్య సాహితి తదితరులు ప్రదర్శించారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



గౌతంనగర్: మిర్జాల్‌గూడలోని శ్రీఆంజనేయ సేవా భక్త బృందం వెంకటేశ్వర స్వామి ఆలయం స్వామివారి 30వ బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీవారి అభిషేకం, అంకురార్పణ, రక్షాబంధనం, వాస్తు హోమం, తీర్థ ప్రసాద విరరణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.

ఎన్నికలకు అన్ని రకాలుగా సిద్ధం

జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ గౌతమ్

కీసర: రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అన్ని రకాలుగా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు, ఈ విషయంలో అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహించి అన్ని రకాలుగా ఎన్నికలకు సిద్ధం అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం కీసరలోని భోగారం హోలీమేరి ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్లు విజయేంద్రరెడ్డి, అభిషేక్ అగస్త్య, డీసీపీ జానకీ, ఐదు నియోజకవర్గాలకు చెందిన ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ ఐదు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ గదులను స్వయంగా పరిశీలించి అందులో ఏర్పాట్లు ఎలా ఉన్నాయో వివరాలను స్వయంగా తెలుసుకున్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు విజయేంద్రరెడ్డి, అభిషేక్ అగస్త్య, డీసీపీ జానకీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బండారి లక్ష్మారెడ్డికి బీ ఫామ్



ఉప్పల్: ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి బుధవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ చేతులమీదుగా బీ ఫామ్ అందుకున్నారు. కార్యక్రమంలో పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి ఉన్నారు. వీరికి సీఎం కేసీఆర్ దిశా నిర్దేశం చేసి పంపారు. ఉప్పల్ అభ్యర్థిని గెలిపించుకుని రావాలని ఆదేశించినట్లు తెలిసింది.

సీఎం కేసీఆర్‌కు నందికంటి కృతజ్ఞతలు

అల్వాల్: రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును బుధవారం అల్వాల్‌కు చెందిన ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.



భక్తిశ్రద్ధలతో దేవి నవరాత్రి ఉత్సవాలు



జేఎల్ఎస్ఎస్‌నగర్‌లో అమ్మవారి మండపం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మల్లికార్జుననగర్ మల్లన్న దేవాలయం, సంతోష్‌నగర్‌లోని అంబ భవాని ఆలయంతోపాటు జేఎల్ఎస్ఎస్‌నగర్‌లో బ్రదర్స్ ఎవర్‌గ్రీన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధుమోహన్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం జరిగింది.



మర్రి మమత ప్రత్యేక పూజలు

అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలోని శ్రీదుర్గా కొర్ల పోచమ్మ టెంపుల్ వెంకట సాయినగర్ కాలనీ వెంకటాపురం అమ్మవారిని బుధవారం మర్రి రాజశేఖర్‌రెడ్డి సతీమణి మమత పోచమ్మ టెంపుల్‌లో సామూహిక కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్‌తో కలిసి కర్యకర్తలను పరిచయం చేసుకున్నారు.

మాదిగల యుద్ధభేరి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఘట్‌కేసర్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో చలో ఇందిరా పార్కు 'మాదిగల యుద్ధభేరి' కరపత్రాన్ని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ మీసాల మల్లేశ్‌మాదిగ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సామాజిక, రాజకీయంగా న్యాయమైన వాటా కోసం పోరాడదామని, రాబోయే పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టే విధంగా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని డిమాండ్ చేశారు. వచ్చేనెల 5న నిర్వహించ తలపెట్టిన సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్యమాదిగ, కౌన్సిలర్ మల్లేశ్, బాలయ్య, రాందాసు, మహిపాల్, ఎల్లేశ్, సంతోశ్, రాజు, నవీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి



మచ్చబొల్లారం డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మైనంపల్లి వాణి

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావును భారీ మెజార్టీతో గెలిపించాలని మైనంపల్లి హన్మంతరావు సతీమణి మైనంపల్లి వాణి అన్నారు. బుధవారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని తుర్కపల్లి బంధంబావి, ఏఆర్‌కే హోమ్స్, రైల్వే ఎంప్లాయిస్ కాలనీలలో గడప గడపకు తిరుగుతూ కాంగ్రెస్ ప్రవేశపెట్టి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో మల్కాజిగిరిలో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, పుట్నాల కృష్ణ, నిమ్మ అశోక్‌రెడ్డి, కృష్ణగౌడ్, శ్రీశైలం యాదవ్, శంకర్, మల్లెల శివ, భబిత, గాయిత్రి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ వెలుగు గుట్టలో సామూహిక కుంకుమార్చన



ఉప్పల్ వెలుగు గుట్టలో సామూహిక కుంకుమార్చనలో భక్తులు

ఉప్పల్: ఉప్పల్ వెలుగుగుట్టలో వెలసిన భ్రమరాంబిక అమ్మవారు దసరా నవరాత్రుల సందర్భంగా రోజుకో రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. బుధవారం కాత్యాయనీ దేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వెలుగుగుట్ట ఆలయ ప్రాంగణం అమ్మవారి గుడితో పాటు చక్కని ఆహ్లాదకరమైన వాతావరణం ఎటు చూసినా పచ్చని చెట్లు, ఓ పక్క శివాలయం, మరోపక్క శ్రీదుర్గా అమ్మవారి ఆలయం భక్తులను కనువిందు చేస్తోంది. ప్రతిరోజూ అన్నదానం నిర్వహిస్తుండటంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడుతోంది. బుధవారం ఉదయం నుంచే అనేక కార్యక్రమాలతో సామూహిక కుంకుమార్చన, 18 రకాల విశేష మంగళ హారతులతో అమ్మవారిని కొలిచారు. అంతకుముందు చండీ హోమంతో భక్తులు పరవశం పొందారు. కార్యక్రమంలో గౌరిగే మల్లేష్, సంతోష్, నవీన్, సూర్యప్రకాశ్, గీతాలక్ష్మీ, ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి ఆర్థిక సాయం



మోహన్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ అశోక్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నేత మోహన్ ఇటీవల కారు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్, బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు కటార్ల భాస్కర్, కుంటి కృష్ణ, బైరపాక ప్రవీణ్, బాసిత్, ఉస్మాన్, శ్రీలం ప్రవీణ్, శేఖర్, శ్రీకాంత్, రమేష్ తదితరులు ఉన్నారు.

బీ ఫాం అందుకున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి



సీఎం కేసీఆర్ చేతులమీదుగా బీఆర్ఎస్ బీఫారం అందుకుంటున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

సాక్షి, మేడ్చల్‌జిల్లా: మేడ్చల్ జిల్లాలోని మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా మర్రి రాజశేఖర్‌రెడ్డి తన బీఫారాన్ని ప్రగతి భవన్‌లో సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ చేతులమీదుగా బుధవారం అందుకున్నాడు. రెండవ విడతలో సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థులకు బీఫారంలు అందజేయడంతో మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డి అల్లుడు రాజశేఖర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ అభ్యర్థి వివేకానంద పాల్గొన్నారు.

అబద్ధాల పార్టీలను ఓడిద్దాం

మల్లాపూర్: అబద్దాలు చెప్పే కాంగ్రెస్, బీజేపీలను ఓడిద్దామని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్‌లో గడపగడపకూ తిరుగుతూ ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కారుగుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఉప్పల్ సమగ్ర అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌నేతలు పీఆర్.ప్రవీణ్, కుంటి కృష్ణ, అల్లాడి కృష్ణయాదవ్, దయాకర్‌రెడ్డి, మల్లేష్, చిన్నదుర్గయ్య, శ్రీశైలం, అండాలు, శోభ తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

ప్రతి ఓటరును చైతన్య పరచాలి



ఉప్పల్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్‌లో ఆ పార్టీ ముఖ్య నేతలతో బుధవారం పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరింత వేగవంతంగా ప్రజల వద్దకు వెళ్లాలని ఎలాంటి ఇబ్బందులున్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. బీఆర్ఎస్ పథకాలు ఓటరు వద్దకు చేర్చి ప్రతి ఓటరును చైతన్యవంతం చేయాలని సూచించారు. ఓటింగ్ శాతాన్ని పెంచడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోగుల దయాకర్‌రెడ్డి, ఆకుల మహేందర్, వేముల సంతోష్‌రెడ్డి, మేకల మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఉప్పల్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ చౌరస్తా ఆటోస్టాండ్ వద్ద సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహం పడి ఉన్న విషయాన్ని స్థానికులు ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మార్వాడీ సమాజం అండగా నిలవాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: రానున్న ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గంలోని మార్వాడీ సమాజమంతా తనకు అండగా నిలవాలని బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కోరారు. బుధవారం ఐమాత అమ్మవారి ఆలయంలోని గోశాలలో జరిగిన పూజ, భజన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎల్ఆర్ మాట్లాడుతూ సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చిన తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. ఒక్కసారి అవకాశం కల్పిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మార్వాడీ సంఘం అధ్యక్షుడు కైలాష్‌శర్మ, డగ్గారాం, మంగ్లారాం, నాయయణ్‌లాల్ పరిహార్, కాలురాం కాగ్, హుకుమారం, దయారాం, రాజు సిర్వి, అనిల్ జైల్ తదితరులు పాల్గొన్నారు.